ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
మంగళవారం 14 మే 2024 | 5





అమలాపురంలో ఓటు హక్కు వినియోగించుకున్న అమలాపురం లోక్‌సభ కూటమి అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్ (పైన), రాజమహేంద్రవరం లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి గిడుగు రుద్రరాజు (ఎడమ)

ప్రజాస్వామ్య చరిత్రలో ఇదొక అపూర్వమైన ఘట్టం. ఇంకా చెప్పాలంటే కనీవినీ ఎరుగని చరిత్ర. సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు వరదలా పోటెత్తారు. ఉదయం ఏడు గంటలకు మొదలైన పోలింగ్.. అర్ధరాత్రి 12 గంటల వరకు సాగుతూనే ఉంది. ఎండ మండిపోతున్నా కొన్నిచోట్ల ఈవీఎంలు మొరాయించినా గంటల తరబడి క్యూలైన్లలోనే నిలబడి మరీ చాలామంది తమ ఓటు హక్కును వినియోగించుకోవడం విశేషం. తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాల్లో రికార్డు స్థాయిలో ఓట్ల శాతం నమోదైంది. కొన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆల్‌టైమ్ రికార్డుగా ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోవడం గమనార్హం. ఓటర్లలో ఇంత చైతన్యం ఎప్పుడూ చూడలేదని పలువురు చెబుతున్నారు. దేశవిదేశాల్లోని వారితోపాటు హైదరాబాద్ సహా ఇతర రాష్ట్రాల్లో ఉన్న వారంతా వేలాదిగా ఓటు వేసేందుకు తరలిరావడం కూడా పెద్ద చర్చనీయాంశంగా మారింది. వాస్తవానికి సాయంత్రం ఆరు గంటలకు పోలింగ్ ముగియాల్సి ఉండగా క్యూలైన్లలో ఉన్నవారందరూ ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఉంది. అలా మొదలైన ఓటింగ్ అర్ధరాత్రి 12 దాటాక కూడా పోలింగ్ జరగడం, విద్యుత్‌కాంతుల మధ్య ఈ ప్రక్రియ కొనసాగడం చూసి అందరూ ఆశ్చర్యచకితులయ్యారు. అంతిమంగా ఈ పోటెత్తిన ఓట్ల వరద ఎవరికి కలిసివస్తుందో, ఎవరిని ముంచుతుందో వేచి చూడాల్సిందే.





ఓటెత్తారు!

కోనసీమలో 82.61 శాతం



క్యూలైన్‌లో నిలుచున్న ఎస్పీ శ్రీధర్



మండపేటలో తొలిసారి ఓటేసిన యువతి



అమలాపురం రూరల్ ఈదరపల్లిలో ఓటేసిన కలెక్టర్ శుక్లా



అమలాపురం రూరల్ జనుపల్లిలో ఓటేసిన సిక్కిం డీజీ శ్రీధర్‌రావు



భట్నవిల్లిలో ఓటేసిన మంత్రి పినిపే విశ్వరూప్ దంపతులు

అమలాపురం టౌన్, మే 13: ఎన్నికల పండుగకు ఓటర్లు పోటెత్తారు. హైదరాబాద్, ముంబై, చెన్నై, బెంగళూరు సహా దేశంలోని ముఖ్య నగరాల్లో ఉన్న వేలాది మంది తమ తమ స్వగ్రామాలకు కుటుంబ సమేతంగా తరలివచ్చారు. విదేశాల నుంచి సైతం ఎందరో ఓటు వేసేందుకు రావడం విశేషం.మండుటెండను సైతం లెక్క చేయక మహిళలు, వృద్ధులు గంటల తరబడి క్యూలైన్లలోనే ఉండి ఓట్లు వేశారు. ముమ్మిడివరం నియోజకవర్గ పరిధిలోని మహిపాలచెరువు పోలింగ్ కేంద్రం వద్దకు వైసీపీ నేత పితాని బాలకృష్ణ రావడంతో స్థానిక యువకులు ఎదురుతిరగడంతో తీవ్ర వాగ్వివాదం చోటు చేసుకుంది. అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ముందస్తుగానే కేంద్ర బలగాలను మోహరించారు. కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ ఎస్.శ్రీధర్ పోలింగ్ తీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. అమలాపురం రూరల్ మండలం జనుపల్లికి చెందిన నవుండ్రు శ్రీధరరావు సిక్కిం డీజీగా వున్నారు. ఆయన ఓటు వేసేందుకు ప్రత్యేకంగా వచ్చారు.

ఉదయం ఏడు గంటలకే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు క్యూకట్టారు. పలు గ్రామాల్లో ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ మందకొడిగానే ప్రారంభమైంది. ఆ తర్వాత అధిక సంఖ్యలో యువ ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు పోటెత్తడంతో ఒక్కసారిగా పోలింగ్ శాతం పెరిగింది. అమలాపురం లోక్‌సభ కూటమి అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్ అమలాపురం నల్లవంతెన వద్ద పోలింగ్ బూత్‌లో ఓటేశారు. అనంతరం జిల్లాలోని పలు పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. రాజమహేంద్రవరం లోక్‌సభ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన గిడుగు రుద్రరాజు అమలాపురంలో ఓటు వేశారు. మంత్రి పినిపే విశ్వరూప్ కుటుంబ సమేతంగా భట్నవిల్లిలో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

పోలింగ్ సరళి ఇలా..

జిల్లాలో మొత్తం 15,31,410 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 7,59,104 మంది, మహిళలు 7,72,285 మంది ఉండగా ఇతరులు 21 మంది ఉన్నారు. సోమవారం ఉదయం 9 గంటలకు అమలాపురం లోక్‌సభ స్థానం పరిధిలో 9.44 శాతం పోలింగ్ నమోదైంది. 11.25 గంటలకు 26.39 శాతానికి పోలింగ్ పెరిగింది. మధ్యాహ్నం 1 గంటకు 43.12శాతం, 3 గంటలకు 57.54 శాతం, 4 గంటలకు 61.22 శాతం, సాయంత్రం 5 గంటలకు 70.73శాతం పోలింగ్ నమోదైంది.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో చెదురుమదురు సంఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. అక్కడక్కడా వైసీపీ, టీడీపీ వర్గాల మధ్య పరస్పర దాడులు జరగడంతో కొద్దిసేపు పోలింగ్ ప్రక్రియను నిలిపివేశారు. సోమవారం సాయంత్రం 5 గంటలకు 70.73శాతం పోలింగ్ నమోదైనట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లా తెలిపారు. కాట్రేనికోన మండలం పల్లం గ్రామంలో టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య జరిగిన దాడిలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని హుటాహుటిన కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుండలేశ్వరంలో ఇరువర్గాల మధ్య ఉద్రిక్త పరిస్థితి నెలకొనగా పోలీసులు రంగప్రవేశంచేసి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. కాజులూరు మండలం ఆర్యవటం పోలింగ్ కేంద్రంలో వైసీపీ, టీడీపీ కార్యకర్తలు మధ్య బాహాబాహీకి దిగడంతో స్వల్ప ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. దాంతో కొద్దిసేపు పోలింగ్ ప్రక్రియను నిలుపుదల చేశారు. అమలాపురం రూరల్ మండలం నడిపూడి, అమలాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రాల వద్ద ఇరువర్గాలు బాహాబాహీకి దిగాయి. సాయంత్రం 5 గంటలకు జిల్లాలోని రామచంద్రపురం అసెంబ్లీ నియోజకవర్గంలో 1,59,043 ఓట్లు పోలవ్వగా 78.27 శాతం నమోదైంది. ముమ్మిడివరంలో 1,70,635 మంది ఓటు హక్కును వినియోగించుకోగా 69.56 శాతం, అమలాపురం ఎస్సీ రిజర్వుడు స్థానంలో 1,54,223 మంది ఓటు హక్కును వినియోగించుకోగా 72.23 శాతం, రాజోలు ఎస్సీ రిజర్వుడు స్థానంలో 1,33,147 మంది ఓటు హక్కును వినియోగించుకోగా 67.27 శాతం, పి.గన్నవరం ఎస్సీ రిజర్వుడు స్థానంలో 1,34,404 మంది ఓటు హక్కును వినియోగించుకోగా 67.68 శాతం, కొత్తపేటలో 1,72,249 మంది ఓటు హక్కును వినియోగించుకోగా 68.25 శాతం, మండపేటలో 1,59,466 మంది ఓటు హక్కును వినియోగించుకోగా 72.32 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ కేంద్రాలకు మహిళలతో పాటు యువ ఓటర్లు పోటెత్తారు. కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన వెబ్ క్యాస్టింగ్ కంట్రోల్ రూమ్ నుంచి పోలింగ్ సరళిని కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ ఎస్.శ్రీధర్ ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. ఎ.వేమవరం పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్, ఎస్పీ పరిశీలించారు. సాయంత్రం 6.30 గంటలకు జిల్లాలో పోలింగ్ వివరాలను కలెక్టరేట్ కార్యాలయం వెల్లడించింది. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పోలింగ్ శాతం... అమలాపురం (79.17), పి.గన్నవరం (75.85), కొత్తపేట (77.30), మండపేట (78.97), ముమ్మిడివరం (76.99), రామచంద్రపురం (82.99), రాజోలు (74.92) జిల్లాలోని కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు రాత్రి 8.30 గంటల సమయానికి కూడా ఓటు హక్కును వినియోగించుకున్నారు.

- జిల్లాలో పోలింగ్ ప్రశాంతం
- ఓటేయడానికి తరలివచ్చిన జనం
- కొన్నిచోట్ల రాత్రి 11 గంటల వరకు
- భారీగా పెరిగిన పోలింగ్ శాతం
- రామచంద్రపురంలో అత్యధికంగా 85.48 శాతం
- రాజోలులో అత్యల్పంగా 78.26 శాతం



మలికిపురం మండలం చింతలమోరిలో ఓటేసిన అమలాపురం లోక్‌సభ వైసీపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావు



మండపేట మండలం మారేడుబాకలో మూడు నెలల చిన్నారితో ఓటేయడానికి వచ్చిన మహిళ

పోటెత్తిన యువ ఓటర్లు

అమలాపురం రూరల్, మే 13: సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేసేందుకు గతంలో ఎన్నడూ లేని విధంగా యువ ఓటర్లు పోటెత్తారు. జిల్లాలో తొలిసారిగా 18 నుంచి 19 ఏళ్ల వయసు గల 33వేల మందికి పైగా యువతీ, యువకులు ఓటు హక్కు పొందారు. వీరితో పాటు 29 ఏళ్లలోపు 2.45 లక్షల మంది యువ ఓటర్లు ఉన్నారు. ఏ పోలింగ్ కేంద్రానికి వెళ్లినా వారిదే సందడి. కొత్తగా ఓటు హక్కు పొందిన వారిలో కొందరు కుటుంబ సమేతంగా వస్తే... మరికొందరు విడివిడిగా పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓట్లు వేశారు. ఆ పోలింగ్ కేంద్రాల వద్దే సెల్ఫీలు తీసుకుంటూ సందడి చేశారు. ఇక ఇతర దేశాల నుంచి సైతం పలువురు యువకులు వచ్చి ఓట్లు వేయడం విశేషం. అమెరికాలో ఉంటున్న రాకుర్తి వెంకటేష్ ఓటు వేసేందుకు ప్రత్యేకంగా వచ్చాడు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు రాష్ట్రాభివృద్ధికే మా ఓటు అంటూ యువ ఓటర్లు కులాలకు అతీతంగా బహిరంగంగా చెప్పడం విశేషం.



అమెరికా నుంచి వచ్చి ఓటేసిన రాకుర్తి వెంకటేష్



బండారులంక వల్లూరువారిపుంత పోలింగ్ కేంద్రంలో రాత్రివేళ కొనసాగిన పోలింగ్

ఫ్లడ్‌లైట్ల వెలుతురులో పోలింగ్

అమలాపురం రూరల్, మే 13: అమలాపురం పట్టణ, పరిసర గ్రామాల్లో సోమవారం రాత్రి 8.15 గంటలు దాటినా పోలింగ్ కొనసాగింది. కొన్నిచోట్ల ఈవీఎంలు సక్రమంగా పనిచేయకపోవడంతో పాటు ఇతర సాంకేతిక కారణాలతో పోలింగ్‌లో జాప్యం జరిగింది. అమలాపురం రూరల్ మండలం నడిపూడి, పేరూరు పంచాయతీల పరిధిలోని విశ్వేశ్వర అగ్రహారం, బండారులంక వల్లూరువారి పుంత పోలింగ్ కేంద్రాల్లో ఫ్లడ్‌లైట్ల వెలుతురులో పోలింగ్ జరిగింది.



ఆలమూరులో 90ఏళ్ల వృద్ధురాలిని పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్తున్న దృశ్యం



రాజోలులో బారులు తీరిన మహిళా ఓటర్లు



కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్న రామచంద్రపురం అసెంబ్లీ కూటమి అభ్యర్థి వాసంశెట్టి సుభాష్



ముమ్మిడివరం అసెంబ్లీ కూటమి అభ్యర్థి దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు) దంపతులు



వేగుళ్ల జోగేశ్వరరావు (మండపేట అసెంబ్లీ)



దేవ వరప్రసాద్ (రాజోలు అసెంబ్లీ)



గిడ్డి సత్యనారాయణ (పి.గన్నవరం అసెంబ్లీ)



అయితాబత్తుల ఆనందరావు (అమలాపురం అసెంబ్లీ)



కొత్తపేట అసెంబ్లీ కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు, ఆయన సోదరుడు శ్రీనివాస్

రాత్రి 10 గంటలకు పోలింగ్ శాతం ఇలా..

అసెంబ్లీ	ఓటర్లు	పోలైనవి	శాతం
అమలాపురం	2,13,508	1,75,890	82.38
పి.గన్నవరం	1,98,602	1,62,474	81.81
కొత్తపేట	2,52,383	2,09,595	83.05
మండపేట	2,20,494	1,85,954	84.34
ముమ్మిడివరం	2,45,296	2,02,617	82.60
రామచంద్రపురం	2,03,207	1,73,707	85.48
రాజోలు	1,97,920	1,54,888	78.26
కోనసీమ జిల్లా	15,31,410	12,65,125	82.61

రాత్రి 10 గంటలకు పోలింగ్ శాతం ఇలా..

అసెంబ్లీ	ఓటర్లు	పోలైనవి	శాతం
జగ్గంపేట	2,29,863	1,75,204	76.22
కాకినాడ సిటీ	2,41,620	1,72,083	71.22
కాకినాడ రూరల్	2,69,330	1,96,659	73.02
పెద్దాపురం	2,15,095	1,58,086	73.50
పిఠాపురం	2,36,409	1,85,832	78.61
ప్రత్తిపాడు	2,17,267	1,60,579	73.91
తుని	2,24,538	1,64,688	73.35
కాకినాడ జిల్లా	16,34,122	12,13,131	74.24

అర్ధరాత్రి 12 గంటలకు పోలింగ్ శాతం ఇలా..

అసెంబ్లీ	ఓటర్లు	పోలైనవి	శాతం
అనపర్తి	2,26,053	1,89,398	83.78
గోపాలపురం	2,42,763	2,06,594	85.10
కొవ్వూరు	1,84,136	1,57,795	85.69
నిడదవోలు	2,13,396	1,71,377	80.31
రాజమండ్రి సిటీ	2,67,484	1,78,456	66.72
రాజమండ్రిరూరల్	2,72,826	1,99,145	72.99
రాజానగరం	2,16,491	1,86,533	86.16
తూర్పుగోదావరి	16,23,149	12,89,298	79.43

కాట్రేనికోన మండలం

పల్లంలో కొట్లాట

ముగ్గురికి తీవ్ర గాయాలు ...7లో

టీడీపీ ఆత్రేయపురం మండల శాఖ అధ్యక్షుడిపై

వైసీపీ మూకల దాడి

- 7లో



కలెక్టరేట్‌లో పోలింగ్ ప్రక్రియను వెబ్ క్యాస్టింగ్‌లో పర్యవేక్షిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా


దుర్గాడలో..


ఐ.పోలవరంలో..


ఆత్రేయపురం మండలం వెలిచేరులో తొలిసారి ఓటు వేసిన యువకులు


రాజమండ్రిలో యువ ఓటరు


రాజమహేంద్రవరంలో ఓటర్ల సందడి


ప్రత్తిపాడు: ధర్మవరంలో కొత్త ఓటర్ల సందడి


తన స్వగ్రామం తూర్పుగోదావరి జిల్లా అనపర్తిలో మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల పోలింగ్ బూత్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ దశరథ రామారెడ్డి, ఆయన భార్య సింధు..


రాజమహేంద్రవరంలో ఓ పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు

ఓటోత్సాహం

పండగలా పోలింగ్ డే

మన్యంలో పోలీస్ నీడన పోలింగ్

రంపచోడవరం, మే 13: అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం మన్యం నియోజకవర్గంలో పోలీసు నీడన సోమవారం నాటి సాధారణ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మధ్నాహ్నం 4 గంటలకే పోలింగ్‌ను ముగించేశారు. ఎక్కడా ఎటువంటి శాంతి భద్రతల సమస్యలు కానీ, అవాంఛనీయ ఘటనలు కానీ చోటు చేసుకోలేదని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రశాంత్‌కుమార్, రంపచోడవరం అదనపు ఎస్పీ జగదీష్ ఆడహళ్లి స్పష్టం చేశారు. 11 మండలాలలోని 399 పోలింగ్ కేంద్రాలలో పోలింగ్‌కు మునుపెన్నడూ లేనంతగా వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షణ చేశారు. మొత్తం 70 శాతం వరకూ పోలింగ్ నమోదైంది. మారేడుమిల్లి, వై.రామవరం, చింతూరు, ఎటపాక మండలాలలో మావోయిస్టు ప్రభావిత సరిహద్దు ప్రాంతాలను పోలీసులు పూర్తిగా తమ అదుపులోకి తీసుకున్నారు. ముఖ్యంగా వై.రామవరం మండలంలోని గుర్తేడు, పాతకోట, ఇర్లవాడ గ్రామాల్లో నిర్వహించిన ఆరు పోలింగ్ కేంద్రాల నుంచి ఈవీఎంలను, సిబ్బందిని వాయుసేనకు చెందిన హెలికాప్టర్ ద్వారా రంపచోడవరంలోని స్ట్రాంగ్ రూమ్ పరిశరాలలోని మైదానానికి తరలించారు. మధ్నాహ్నం నాలుగు గంటలకే పోలింగ్ సమయం ముగిసిపోయినప్పటికీ అప్పటికే లైన్లో ఉన్న వారందరికీ సాయంత్రం ఐదు గంటలవరకూ పోలింగ్‌కు అనుమతించారు. తెలుగుదేశం అభ్యర్థి మిరియాల శిరీషాదేవి రాజఒమ్మంగి మండలం అనంతగిరిలోనూ, వైసీపీ అభ్యర్థి నాగులాపల్లి ధనలక్ష్మి అడ్డతీగల మండలం పాపంపేటలోనూ, సీపీఎం అభ్యర్థి లోతా రామారావు రాజఒమ్మంగి మండలంలోనూ ఓటు హక్కు వినియోగించుకున్నారు.


గుర్తేడు పోలింగ్ కేంద్రం వద్ద సాయుధ పోలీసు నిఘా

పవన్‌కు ప్రేమతో ఓటేశారు

జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు


ఓటింగ్ సరళిని పరిశీలిస్తున్న నాగబాబు

పిఠాపురం, మే 13: అభిమానంతో ఓటు వేయడం వేరు, ఇష్టంతో ఓటు వేయడం వేరు ఈ రెండు కలిపి పిఠాపురం నియోజకవర్గ ప్రజలు ప్రేమతో జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు ఓటు వేశారని జనసేన ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు తెలిపారు. ఆయన నియోజకవర్గంలో పోలింగ్‌బూత్‌లను సోమవారం సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించారు. పిఠాపురం ప్రజలు తమ అమూల్యమైన ఓటుతో పవన్ బాధ్యతను మరింత పెంచారని నాగబాబు చెప్పారు. పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థిగా పవన్‌కల్యాణ్ పేరు ప్రకటించిన నాటి నుంచి నేటి వరకూ అలుపెరగని పోరాటం చేసిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. జనసేన పార్టీ శ్రేణులతో టీడీపీ, బీజేపీ శ్రేణులు మమేకమైన తీరు మరువలేనిదని చెప్పారు. నియోజకవర్గంలో క్షేత్ర స్థాయిలో పనిచేసిన నాయకులు, కార్యకర్తలు, వీరమహిళల శ్రమ వెలకట్టలేదని తెలిపారు. పవన్ పోటీతో పిఠాపురం పార్టీ శ్రేణులపై ఒత్తిడి ఏర్పడిన మాట వాస్తవమని, అయినప్పటికి చిన్న ఇబ్బంది లేకుండా ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేయడానికి దోహదం చేసిన ప్రతి ఒక్కరిని ఆయన అభినందించారు. మండల, గ్రామ, పట్టణ, వార్డు స్థాయిలో కమిటీలుగా ఏర్పడి పవన్‌కల్యాణ్ అభ్యర్థిత్వాన్ని బలపరిచేందుకు శ్రమించిన ప్రతి ఒక్కరి సేవలను గుర్తిస్తామని తెలిపారు.

4 చోట్ల ఈవీఎంల మార్పు

ప్రత్తిపాడు, మే 13: ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఈవీఎం మిషన్లలో కాకినాడ ఎంపీ జనసేన కూటమి అభ్యర్థి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ ఫొటోపై స్టాంప్ పడటంతో అతని బొమ్మ అస్పష్టత ఉండటం వల్ల 14 గ్రామాల నుంచి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.శ్రీనివాసరావుకు ఫిర్యాదులు అందాయి. దీంతో ఆర్వో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 4 చోట్ల ఈవీఎం మిషన్లలో జనసేన అభ్యర్థిపై స్టాంప్ లేకుండా చర్యలు తీసుకున్నారు. అలాగే మండలంలోని శరభవరం, ఒమ్మంగి గ్రామాల్లో కూడా టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య స్వల్ప వివాదాలు, ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ప్రత్తిపాడు నియోజకవర్గంలో 2,17,267 మంది ఓటర్లు ఉండగా సాయంత్రం నాటికి 68 శాతం పోలింగ్ నమోదయింది.

పల్లంలో కొట్లాట

ముగ్గురికి తీవ్రగాయాలు





కాట్రేనికోన, మే 13: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పల్లంలో అల్లర్లు చెలరేగాయి. వైసీపీ, టీడీపీ వర్గీయుల మధ్య జరిగిన గొడవల్లో ముగ్గురికి గాయాలయ్యాయి. టీడీపీ వర్గీయుల ఇంటి వద్ద వైసీపీ వర్గీయులు కవ్వింపు చర్యలకు పాల్పడటంతో ఘర్షణ జరిగి ఇరువర్గాలు రాళ్లతో దాడులకు పాల్పడ్డారు. మల్లాడి చినధర్మారావు, మల్లాడి నరసింహమూర్తి, మల్లాడి సతీష్ తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని కాకినాడ ఆసుపత్రికి తరలించారు. అమలాపురం డీఎస్పీ ఆధ్వర్యంలో పోలీసు రక్షణ ఏర్పాటు చేశారు. బలుసుతిప్పలో టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య గొడవతో ఉద్రిక్తత నెలకొంది. కుండలేశ్వరంలో వైసీపీ, టీడీపీ కార్యకర్తల మధ్య వాగ్వివాదం జరిగి తోపులాటకు దారితీసింది. వైసీపీకి చెందిన దివ్యాంగుడు కోలా సత్యనారాయణ ఈ సంఘటనలో గాయపడ్డాడు.

వంగా గీతకు చుక్కెదురు


వంగా గీతను అడ్డుకుంటున్న జనసేన కార్యకర్తలు

పిఠాపురం రూరల్, మే 13: పిఠాపురం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీతావిశ్వనాథ్‌కు గ్రామాల్లో చుక్కెదురయింది. పలు చోట్ల గీతను అడ్డుకున్నారు. విరవ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ సరళి పరిశీలించేందుకు సోమవారం మధ్యాహ్నం వెళ్లిన గీతను లోపలకు వెళ్లకూడదంటూ జనసేన కార్యకర్తలు అడ్డుకున్నారు. నినాదాలతో హోరెత్తించారు. పోలింగ్ కేంద్రంలోకి వెళ్లనిచ్చేది లేదంటూ అడ్డుతగిలారు. దీనితో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు జోక్యం చేసుకుని ఆమెను లోపలకు పంపారు. కుమారపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పోలింగ్ కేంద్రం వద్దకు వచ్చిన గీతను తమకు డబ్బులు ఇవ్వలేదంటూ ఓటర్లు ప్రశ్నించారు. ఇచ్చామని సర్పంచ్, ఎంపీటీసీలు చెప్పడంతో వాగ్వివాదం చోటు చేసుకుంది. డబ్బులు ఇవ్వకుండా ఇచ్చారని అంటారా అంటూ ఓటర్లు నిలదీశారు. పోలీసులు వచ్చి సర్దుబాటు చేశారు. బి.ప్రత్తిపాడులోనూ గీతకు ఇదే పరిస్థితి ఎదురయింది. పోలింగ్ కేంద్రంలోకి రావద్దంటూ నినాదాలు చేశారు.

డబ్బులిస్తేనే ఓట్లు వేస్తాం

గొల్లప్రోలు రూరల్, మే 13: గొల్లప్రోలు మండలం కొడవలిలో ఓటర్లు వైసీపీ నేతలకు ఝలక్ ఇచ్చారు. కాలనీకి చెందిన ప్రజలను ఓటు వేయడానికి రావాలని ఓటర్లను వైసీపీ నేతలు కోరారు. ఓటర్లు పోలింగ్ కేంద్రం వద్దకు చేరుకున్నారు. అయితే డబ్బులు ఇవ్వకుండా వైసీపీ నేతలు ముఖం చాటేశారు. దీనితో ఓటర్లు తాము ఓటు వేసేది లేదంటూ భీష్మించారు. వారికి నచ్చచెప్పేందుకు టీడీపీ,జనసేన నేతలు కోరినా ఫలితం లేకపోయింది.

ఓటు వేసిన అనంతరం..

ఇంటికొచ్చి ఫిట్స్‌తో వ్యక్తి మృతి

మామిడికుదురు, మే 13: ఓటు హక్కు వినియోగించుకున్న వ్యక్తి ఫిట్స్ రావడంతో మృతి చెందాడని బంధువులు తెలిపారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం గోగన్నమఠంలో కర్రి సత్యనారాయణ(52) ఓటు హక్కును వినియోగించుకుని ఇంటికి వెళ్లాడు. ఫిట్స్ రావడంతో రాజోలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్టు బంధువులు తెలిపారు.

రేగులపాడులో

కూనవరం, మే 13: మండలంలోని రేగులపాడులో పైదా పార్వతి(41) ఓటు వేయడానికి పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటేసి ఇంటికి తిరిగివచ్చిన కొద్దిసేపటికే మృతిచెందింది. మండలంలో భారీగా ఓటు శాతం నమోదైంది.

చున్నీ మెడకు చుట్టుకుని బాలిక మృతి



మోతుగూడెం, మే13: వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ డొంకరాయి గ్రామంలో మల్లవరపు పవిత్ర(10) ఉయ్యాల చున్నీ మెడకు చుట్టుకోవడంతో మృతిచెందింది. చిన్నారి తల్లిదండ్రులు వీరభద్రరావు, దేవి దంపతులు ఓటు వేయడానికి వెళ్లారు. ఇంటి గుమ్మానికి చున్నీతో ఉయ్యాలతో పవిత్ర ఆడుకుంటూ ఊగడంతో ఒక్కసారిగా చున్నీ మెడకి చుట్టుకోవడంతో ఊపిరాడక అలాగే ఉండిపోయింది. కొద్దిసేపటి తర్వాత ఓటేసి తల్లిదండ్రులు ఇంటికి వచ్చే చూసేసరికి పవిత్ర మెడకు చున్నీ వేలాడుతూ చూసి తల్లిదండ్రులు ఆటోలో డొంకరాయి ఏపీజెన్కో ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆమె కండిషన్ సీరియస్‌గా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం అంబులెన్స్‌లో చింతూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆమె అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. డొంకరాయి ఎస్ఐ శివకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'బూత్'పై వైసీపీ ప్రతాపం

పలు చోట్ల దౌర్జన్యాలు..కూటమి క్యాడర్‌పై దాడులు


గాయపడ్డ జగడం నరేష్

తాళ్లరేవు, మే 13: కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలంలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగినప్పటికీ కొన్నిచోట్ల వైసీపీ కార్యకర్తలు ఓటమి భయంతో టీడీపీ,జనసేన, బీజేపీ ఉమ్మడి కార్యకర్తలపై దాడులు నిర్వహించారు. కోరింగ పంచాయతీ చినబొడ్డువెంకటాయపాలెంలో పోలింగ్ బూత్ కేంద్రాలు వద్ద వైసీపీ, కూటమి కార్యకర్తల మధ్య వాగ్వాదం జరిగింది. పాతకోరింగలో వైసీపీ కార్యకర్తలు, టీడీపీ కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగింది. పోలేకుర్రు పంచాయతీ తోటపేట పోలింగ్ కేంద్రాల వద్ద వైసీపీ కార్యకర్తలు టీడీపీ బీసీ ఓటర్లను అడ్డుకొని దౌర్జన్యం దాడులు చేయడంతో ఇరువురు మధ్య ఘర్షణ జరిగింది. జగడం నరేష్‌కు తీవ్రగాయం కాగా భత్రాజు యేసు, మహాలక్ష్మీ రావు, కడలి గోపి, రెడ్డి సత్యనారాయణ గాయపడ్డారు. సంఘటన స్థలానికి కోరింగ ఎస్ఐ రవికుమార్ సిబ్బందితో చేరుకుని గ్రూపులను చెదరగొట్టి పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా చర్యలు చేపట్టారు.

టీడీపీ మండలాధ్యక్షుడికి గాయాలు



ఆత్రేయపురం, మే 13: సార్వత్రిక ఎన్నికలను ఎదుర్కోలేని వైసీపీ శ్రేణులు టీడీపీ మండల అధ్యక్షుడిపై దాడికి పాల్పడ్డారు. సోమవారం ఆత్రేయపురం పోలింగ్ కేంద్రంలోకి వైసీపీ నాయకులు వెళ్లడంతో అడ్డువచ్చిన టీడీపీ మండలాధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజుపై వైసీపీ మూకలు దాడికి పాల్పడ్డాయి. చొక్కాను చించి భుజంపై గాయపరిచారు. ఆత్రేయపురంలో టీడీపీకి మంచి మెజార్టీ వస్తుందని దానిని చూసి ఓర్వలేకే తనపై దాడికి పాల్పడ్డాడని వెంకట్రాజు ఆరోపించారు. తనపై ఉద్దేశపూర్వకంగానే వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి వైసీపీ కార్యకర్తలను రెచ్చగొట్టి దాడికి పాల్పడేలా చేశారన్నారు. ఆత్రేయపురం మండలంలో మంచి మెజార్టీ సాధించడం తథ్యమని కూటమి అభ్యర్థి బండారు భారీ మెజార్టీతో విజయం సాధిస్తారన్నారు. వెంకట్రాజును ఇంటి వద్ద కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు పరామర్శించి సంఘటనల వివరాలు తెలుసుకున్నారు. వైసీపీ దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు.

దొమ్మేరులో ఘర్షణ

కొవ్వూరు, మే 13: కొవ్వూరు మండలం దొమ్మేరులో టీడీపీ, వైసీపీ నాయకుల మధ్య స్వల్ప వివాదం చోటు చేసుకుంది. దొమ్మేరు జడ్పీ హైస్కూల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. కేంద్రాల వద్ద టీడీపీ, వైసీపీ నాయకులు ఒకరిపైఒకరు ఆరోపణలు చేసుకుని ఘర్షణకు దిగారు. సీఐ వి.జగదీశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకుని రెండు పార్టీల కార్యకర్తలను అక్కడ నుంచి పంపించివేశారు. అదే సమయంలో వచ్చిన పోలీసు ఎన్నికల అబ్జర్వర్ బలరాం మీనా వివరాలు సేకరించారు. పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

వైసీపీ నాయకుల దాడిలో విరిగిన కాలు

రంగంపేట, మే 13 : మండలంలో సోమవారం ఉదయం 7 గంటల నుంచే ఓటర్లు పోలింగ్ బూత్‌ల దగ్గర బారులుతీరారు. కొన్ని పోలింగ్ బూత్‌లలో ఉదయం 7 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. రంగంపేట మండలం సుభద్రంపేటలో పోలింగ్ బూత్ ఏజెంట్‌గా విధులు నిర్వహిస్తున్న గుద్దటి సూరిబాబుపై వైసీపీ నాయకులు దాడి చేయడంతో కాలు విరిగింది. పెద్దాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అనంతరం ఇంటికి తీసుకెళ్లారు. అనంతరం సూరిబాబును అనపర్తి నియోజకవర్గ ఎన్డీయే అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పరామర్శించారు. మండలంలో వడిశలేరు, బాలవరం, మరికొన్ని గ్రామాల్లో రాత్రి 8 గంటల వరకు పోలింగ్ జరిగింది.

టీడీపీ సానుభూతిపరులపై వైసీపీ రాళ్ల దాడి



అనపర్తి, మే 13: పెదపూడి మండలం గొల్లల మామిడాడ శివారు లక్ష్మీనరసాపురంలో పోలింగ్ బూత్ వద్ద సచివాలయ కార్యదర్శి దుర్గా ప్రసాద్ పోలింగ్ బూత్ వద్ద ఫ్యాన్‌కు ఓటు వేయాలని ప్రచారం చేస్తుండటంతో టీడీపీ కార్యకర్తలు కార్యదర్శిని నిలదీశారు. ఎటువంటి పోలింగ్ పాసులు లేకుండా పోలింగ్ స్టేషన్‌లో ఉండటంపై కూటమి అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అధికారులకు ఫిర్యాదు చేశారు. అదే విధంగా బలభద్రపురంలో ఆశవర్కర్ వైసీపీకి ప్రచారం నిర్వహిస్తుండటంతో టీడీపీ కార్యకర్తలు అడ్డుకోవడంతో కొద్దిసేపు వాగ్వివాదం జరిగింది. రంగాపురంలో ముగ్గురు అన్నదమ్ములపై వైసీపీ కార్యకర్తలు రాళ్లు రువ్వడంతో ఇరువురు సోదరులు గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కూటమి బీజేపీ అభ్యర్థి నల్లమిల్లి అనపర్తి ఏరియా ఆసుపత్రిలో పరామర్శించారు.

వైసీపీ ఎంపీపీ హల్‌చల్

బిక్కవోలు మండలం కొమరిపాలెం గ్రామంలో పోలింగ్ స్టేషన్‌లో ఓటింగ్ సరళి పరిశీలించేందుకు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అక్కడికి చేరుకున్నారు. ఆయనతో పాటుగా నలుగురు వ్యక్తులు ఉండటంతో ఎంపీపీ జ్యోతిర్మయి పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. దీంతో టీడీపీ శ్రేణులు ముందుకు రావడంతో కొద్ది సేపు రెండు వర్గాల మధ్య గొడవ జరిగింది. చివరకు పోలీసులు సర్దిచెప్పడంతో వివాదం సద్దుమణిగింది. రాళ్ల దాడిలో గాయపడిన కార్యకర్తలను ఆస్పత్రిలో నల్లమిల్లి పరామర్శించారు.

కాంగ్రెస్ అభ్యర్థి కారు ధ్వంసం

కాట్రేనికోన, మే 13: ముమ్మిడివరం అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి పాలెపు ధర్మారావు కారును గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఆదివారం రాత్రి కాట్రేనికోన కళ్యాణి థియేటర్ వద్ద పార్కింగ్ చేసిన కారు అద్దాలను ధ్వంసం చేశారు. ధర్మారావు కాట్రేనికోన పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన ప్రత్యర్థులు కావాలనే తన కారును ధ్వంసం చేశారని ఆరోపించారు. ఎన్నికల ప్రచారం నిమిత్తం ధర్మారావు కారును ఇటీవల కొనుగోలు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

- ఓట్లు వేసేందుకు పోటెత్తిన ఓటర్లు
- ఓటర్లు ఎండలోనూ బారులు తీరారు
- ప్రతి నియోజకవర్గంలో అధిక శాతం పోలింగ్

ప్రశాంతంగా పోలింగ్


అంబాజీపేట: ముక్కామలలో తొలిసారి ఓటు హక్కు వినియోగించుకున్న యువతులు


మండపేట: పట్టణంలోని ప్రకాశం పాఠశాల వద్ద బారులు తీరిన ఓటర్లు





అంతర్వేదిలో నాయకులతో మాట్లాడుతున్న దేవ వరప్రసాద్ అయినవిల్లిఓటు వేసేందుకు వీల్ చైర్‌లో వచ్చిన వృద్ధురాలు, ఐ.పోలవరం: తొలిసారి ఓటేసిన యువతులు, కపిలేశ్వరపురం: వల్లూరులో ఓటేసిన జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ లీలాకృష్ణ దంపతులు

మామిడికుదురు, మే 13: మండలంలో సోమవారం జరిగిన పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా సాగింది. ఆదుర్రులోని పోలింగ్ కేంద్రంలో ఉదయం 8 గంటల సమయంలో ఈవీఎం మొరాయించి అరగంట పనిచేయలేదు. అదేవిధంగా పలుచోట్ల ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ ప్రక్రియకు ఆటంకం ఏర్పడింది. ఉదయం మందకొడిగా సాగిన పోలింగ్ ప్రక్రియ మధ్యాహ్నానికి ఊపందుకుంది. ప్రధానంగా యువత ఎక్కువ శాతం ఓటు హక్కును వినియోగించుకున్నారు. వృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు పలు గ్రామాల్లో ఓటు వేయడానికి పోలింగ్‌కేంద్రాలకు బంధువుల సాయంతో వచ్చారు. ఏవిధమైన అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి.

ఐ.పోలవరంలో గంట ఆలస్యంగా పోలింగ్

ఐ.పోలవరం, మే 13: మండలంలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం ఏడు గంటల నుంచి ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. ఎండను సైతం లెక్కచేయకుండా గంటల తరబడి క్యూలో నిలిచి ఓటు హక్కు వినియోగించుకున్నారు. కేశనకుర్రు, ఐ.పోలవరం, మురమళ్ళ భైరవపాలెం, జి.వేమవరం, జి.మూలపొలం, టి.కొత్తపల్లి గ్రామాల్లో ఓటర్లు బారులుతీరారు. ఐ.పోలవరం హైస్కూల్ పోలింగ్ కేంద్రంలో ఈవీఎం మొరాయించడంతో గంట ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. మురమళ్ళ జడ్పీ హైస్కూల్ పోలింగ్ కేంద్రంలో అభ్యర్థి బుచ్చిబాబు ఓటు వేశారు.

దిండిలో ఓటేసిన దేవవరప్రసాద్

మలికిపురం, మే 13: మండలంలో స్వల్ప సంఘటనలు మినహా ఓటింగ్ ప్రశాంతంగా జరిగింది. ఉదయం నుంచే ఓటర్లు ఓటు వేసేందుకు భారీగా వచ్చారు. చింతలమోరిలో అమలాపురం వైసీపీ పార్లమెంటు అభ్యర్థి రాపాక వరప్రసాదరావు ఓటు హక్కును వినియోగించుకున్నారు. దిండిలో కూటమి అభ్యర్థి దేవ వరప్రసాద్ 66వ పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎన్ఆర్ఐ రావి రాధాకృష్ణ మలికిపురంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

స్వల్ప ఘర్షణలు మినహా ప్రశాంతం

ఆత్రేయపురం, మే 13: మండలంలో పోలింగ్ స్వల్ప సంఘటనలు మినహా ప్రశాంతంగా ముగిసింది. మండలంలోని 17 గ్రామాల్లో 62పోలింగ్ బూత్‌ల ద్వారా వృద్ధులు, యువకులు, మహిళలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎండను సైతం లెక్క చేయకుండా ఓటర్లు బారులుతీరి ఓటు వేశారు. వివిధ గ్రామాల్లో ఈవీఎంలు మొరాయించాయి. కొన్ని చోట్ల పోలింగ్ నత్తనడకగా సాగడంతో ఓటర్లు అసహనం వ్యక్తం చేశారు. తాడిపూడి పోలింగ్ బూత్‌లో వైసీపీ కార్యకర్త నగదు ఎరచూపగా టీడీపీ శ్రేణులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. వివిధ గ్రామాల్లో టీడీపీ, వైసీపీ శ్రేణుల మధ్య స్వల్ప ఘర్షణలు తలెత్తాయి. కొత్తపేటలో కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు పోలింగ్ సరళిని పరిశీలించి పార్టీ శ్రేణులతో సమీక్షించారు. వాడపల్లి, మెర్లపాలెం, వద్దిపర్రు తదితర గ్రామాల్లో సోమవారం అధికార పార్టీ పంచిన చీరలను స్వచ్ఛందంగా వీధుల్లోకి తీసుకువచ్చి గుట్టలుగా పోశారు. కొన్ని గ్రామాల్లో వైసీపీ నేతల ఇళ్లకు వెళ్లి చీరలనువిసిరివేశారు.

బారులు తీరి ఓటు హక్కు వినియోగం

రావులపాలెం, మే 13: మండలంలో చదురుమదురు సంఘటనలు మినహా సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మండలంలో ఉన్న పన్నెండు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరి ఓటు హక్కును వినియోగించుకున్నారు. రావులపాలెంలోని రావిచెట్టు వద్దనున్న పోలింగ్ కేంద్రం వద్ద వైసీపీ కార్యకర్తలు పెద్దఎత్తున గుమిగూడడంతో పోలీసులు చెదరగొట్టే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో స్వల్ప వాగ్వివాదం చోటు చేసుకుంది. అక్కడున్నవారు సర్ది చెప్పడంతో గొడవ సర్దుమణిగింది. ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఒక వృద్ధురాలు వీల్‌చైర్‌లో వచ్చింది. బంధువుల సాయంతో వీల్‌చైర్‌లో పోలింగ్ కేంద్రంలోకి వెళ్లి ఓటు హక్కును వినియోగించుకుంది.

ఈవీఎంల మొరాయింపు

ఆలమూరు, మే 13: మండలంలో సోమవారం పోలింగ్ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంతంగా జరిగింది. మండలం ఉదయం 7గంటల నుంచి ఓటింగ్ ప్రారంభం కాగా కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. ఆరు గంటలకు ముందే పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు చేరుకోవడంతో మండలంలో పలు కేంద్రాల్లో ఏడు గంటల తరువాత కూడా పోలింగ్ జరిగింది. ఆలమూరు పోలింగ్ కేంద్రానికి 90ఏళ్ల వృద్ధురాలిని చేతులతో మోసుకొచ్చి ఓటు వేయించారు. పోలింగ్ కేంద్రాలను పలు పార్టీల అభ్యర్థులు సందర్శించి ఓటింగ్ పరిస్థితిని పరిశీలించారు.

ఓటేసేందుకు ఎండలో క్యూకట్టారు

రాయవరం, మే 13: మండలంలో 12 గ్రామాల్లో చెదురుమదురు సంఘటనలు మినహా సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా సాగింది. ఓటర్లు ఎండను సైతం లెక్కచేయకుండా ఓటు హక్కు వినియోగించుకునేందుకు బారులు తీరారు. చెల్లూరు శివారు కృష్ణమ్మ చెరువు వద్ద కొద్దిసేపు ఈవీఎం మొరాయించడంతో గంటకుపైగా పోలింగ్ నిలిచిపోయింది. సాయంత్రం కురకాళ్లపల్లిలో కొద్దిసేపు ఈవీఎం మొరాయించడంతో సరిచేసి పోలింగ్ కొనసాగించారు. కూటమి అభ్యర్థి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పలు గ్రామాల్లో పర్యటించి పోలింగ్ జరుగుతున్న తీరును పార్టీ కార్యకర్తలను ఆరాతీశారు. సోమేశ్వరం ప్రాథమిక పాఠశాల పోలింగ్ కేంద్రంలో ఎండలో ఓటర్లు ఇబ్బందులు పడగా స్థానిక గ్రామ సచివాలయం పోలింగ్ కేంద్రం వద్ద ఓటు వేసేందుకు సోమేశ్వరం-రాజానగరం ప్రధాన రహదారిపై ఓటర్లు ఎండలో నిలబడి ఓటు వేసేందుకు క్యూకట్టారు. చెల్లూరు, వెదురుపాక, కురకాళ్లపల్లి గ్రామాల్లో సాయంత్రం 6గంటలు తరువాత కూడా క్యూలో ఉన్న ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

205 కేంద్రాల్లో పోలింగ్

రాజోలు, మే 13: మండలంలో సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ సోమవారం ప్రశాంతంగా ముగిసిందని రాజోలు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్.నుపూర్అజయ్ తెలిపారు. రాజోలు నియోజకవర్గంలో 1,97,920మంది ఓటర్లలో పురుషులు 97,807మంది, మహిళలు 1,00,112 మంది, ఇతరులు ఒకరు ఉన్నారు. 205 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 205మంది పీవోలు, 205మంది ఏపీవోలు, 1230మంది ఓపీవోలు, 16మంది సెక్టార్ అధికారులు, 43మంది వెబ్‌కాస్టింగ్ సిబ్బంది, 75మంది మైక్రో అబ్జర్వర్లు, 16మంది రూట్ ఆఫీసర్లు విధులు నిర్వహించారు. రాజోలు నియోజకవర్గంలో 60 గ్రామాలకు 39గ్రామాలను సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించి పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేశామని రాజోలు సీఐ ఆర్.గోవిందరాజు తెలిపారు. ఒక అడిషనల్ ఎస్పీ, ముగ్గురు డీఎస్పీలు, 9మంది సీఐలు, 17మంది ఎస్ఐలు, 43మంది హెచ్‌సీలు, 69మంది కానిస్టేబుళ్లు, ముగ్గురు మహిళా కానిస్టేబుళ్లు, 45మంది హోంగార్డులు విధులు నిర్వహించారని తెలిపారు. చింతలపల్లిలో డిప్యూటీ మాజీ స్పీకర్ అల్లూరి వెంకటసూర్య నారాయణరాజు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

16గ్రామాల్లో పోలింగ్ ప్రశాంతం

అంతర్వేది, మే 13: సఖినేటిపల్లి మండలంలోని పదహారు గ్రామాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. గ్రామాల్లోని కొన్ని బూత్‌ల్లో ఉన్న ఈవీఎంలు స్లోగా పనిచేయడంతో క్యూలైన్లు పెరిగి సమయం ఎక్కువ పట్టిందని ఓటర్లు వాపోయారు. అంతర్వేది 22వ పోలింగ్ కేంద్రంలో ఓట్లు వేసే సమయంలో ఈవీఎం ఆగిపోవడంతో కొంత సమయం పోలింగ్ ఆలస్యంగా సాగింది. మోరిలో 30వ పోలింగ్ కేంద్రంలో రెండు సామాజికవర్గాల మధ్య చిన్నపాటి ఘర్షణ జరగ్గా కేంద్ర బలగాలు అక్కడకు చేరుకోవడంతో గొడవ సర్దుమణిగింది. కొత్త ఓటర్లు ఉత్సాహంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. కూటమి అభ్యర్థి దేవ వరప్రసాద్ 16 గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.








కొత్తపేటలో ఉదయాన్నే బారులుతీరిన ఓటర్లు, మామిడికుదురు: మామిడికుదురులో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు, అల్లవరం: బెండమూర్లంలో కుటుంబ సమేతంగా ఓటేసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ళ దొరబాబు, ముమ్మిడివరం: సోమిదేవరపాలెంలో ఓటేసిన ఎంపీపీ సుధారాణిమచ్చా రూపవతి, పి.గన్నవరం: అమెరికా నుంచి ఓటేసిన తోలేటి హరిప్రసాద్ కుటుంబం, అమెరికా నుంచి వచ్చిన కామిశెట్టి సాయిగౌతమ్

మూడు చోట్ల ఈవీఎంల సమస్య

కె.గంగవరం, మే13: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతగా జరిగింది. ఉదయం ఏడు గంటల నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. యండగండిలో ఉదయం నుంచి సీనియర్ సిటిజన్స్ ఓట్లువేయడానికి బూత్‌కు వచ్చారు. అముజూరు, సత్యవాడ బూత్‌ల్లో ఈవీఎం మొరాయించడంతో పోలింగ్ ఆలస్యమైంది. శివలలోని 180పోలింగ్ బూత్‌లో ఈవీఎం పలుమార్లు మొరాయిండంతో ఓటర్లు ఎక్కువ సమయం నిరీక్షించారు. తామరపల్లి, కుందూరు, మసకపల్లి గ్రామాల్లో కూటమి పార్టీ, వైసీపీ కార్యకర్తలకు మధ్య స్వల్ప ఘర్షణలు జరిగాయి. శివలలో కూటమి పార్టీలు ఏర్పాటు చేసుకున్న టెంట్‌ను పోలీసులు తొలగించారు. దీంతో కూటమి పార్టీ కార్యకర్తలకు పోలీసులకు వాగ్వివాదం జరిగింది. స్వల్ప సంఘనటనలు మినహా ఎన్నికల ప్రశాంతంగా జరిగాయి. కూటమి అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ కూళ్ల, కోటి పల్లి, దంగేరు తదితర గ్రామాల్లో పోలింగ్ సరళిని పరిశీలించారు. కార్యకర్తలను అడిగి పోలింగ్ సరళి గురించి తెలుసున్నారు.

186వ బూత్‌లో ఈవీఎం మొరాయింపు

కపిలేశ్వరపురం, మే 13: మండలంలో సోమవారం స్వల్ప సంఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మండలంలో 54,075మంది ఓటర్లు ఉండగా పురుషులు 26,867 మంది, మహిళలు 27,220మంది ఉన్నారు. మండలంలో ఏర్పాటుచేసిన 58పోలింగ్ కేంద్రాల్లో ఉదయం ఏడు గంటలకు ఓటింగ్ ప్రారంభించారు. సాయంత్రం ఆరు గంటలు దాటినా ఓటర్లు పోలింగ్ కేంద్రాల్లో బారులు తీరడంతో రాత్రి తొమ్మిది గంటల వరకు ఓటు హక్కు వినియోగించుకున్నారు. అంగరలో 186వ పోలింగ్ కేంద్రంలో ఈవీఎం మొరాయించడం ఓటింగ్ గంట సేపు ఆలస్యంగా ప్రారంభమైంది. పలు చోట్ల ఈవీఎంలు మొరాయించడంతో సరిచేసి ఓటింగ్ నిర్వహించారు. ఎండను లెక్కచేయకుండా వృద్ధులు, వికలాంగులు, యువత, మహిళలు బారులు తీరి ఓటు హక్కును వినియోగించుకున్నారు. వల్లూరు ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో మండపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ వేగుళ్ల లీలాకృష్ణ, ఆయన సతీమణి అనిత ఓటు హక్కు వినియోగించుకున్నారు. నేలటూరు, కోరుమిల్లి, కపిలేశ్వరపురం తదితర గ్రామాల్లో స్వల్ప ఘటనలు చోటుచేసుకోగా పోలీసులు జోక్యంతో సద్దుమనిగాయి. ఎన్నడూ లేని విధంగా సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

స్వల్ప ఘటనలు మినహా ప్రశాంతం

ముమ్మిడివరం, మే 13: ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గంలో చెదురుమదురు సంఘటనలు మినహా సోమవారం ఓటింగ్ ప్రశాంతంగా జరిగింది. పోలింగ్ సమయం ప్రారంభానికి ముందే ఓటర్లంతా ఉత్సాహంగా పోలింగ్ కేంద్రాల వద్ద ఓటు హక్కును వినియోగించుకునేందుకు బాలురు తీరారు. ముమ్మిడివరం పెట్టావారిపేట 25వ పోలింగ్ కేంద్రంలో, జడ్పీ బాలుర హైస్కూలు పోలింగ్ కేంద్రం 16, 17, ఐ.పోలవరం మండలం ఐ.పోలవరం జడ్పీహైస్కూలు 149 పోలింగ్ కేంద్రంలో ఈవీఎంలు మొరాయించడంతో ఉదయం అర గంట ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. ఉదయం 9గంటలకు 8.01శాతం, 11 గంటలకు 25.99శాతం, మధ్యాహ్నం 1 గంటకు 41.99శాతం, 3గంటలకు 56.09శాతం, 4 గంటలకు 61.27 శాతం, 5గంటలకు 69.56శాతం, ఆరు గంటలకు 74.61 శాతం పోలింగ్ జరిగింది. 2,45,296 మంది ఓటర్లకు 1,83,013 మంది ఓటు వేశారు. వీరిలో పురుషులు 89,931 మంది, మహిళలు 93082 మంది ఓటు హక్కు వినియోగించు కున్నారు. పోలింగ్ ముగిసే సమయానికి– శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఓటింగ్ సరళి ఒకేరకంగా సాగింది. కాట్రేనికోన మండలం పల్లంలో టీడీపీ-వైసీపీ వర్గాల మధ్య జరిగిన పరస్పర దాడుల్లో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. వారిని కాకినాడ ఆసుపత్రికి తరలించారు. దీంతో అక్కడ కొంతసేపు పోలింగ్ ప్రక్రియ నిలిచిపోయింది. మహిపాలచెరువు 32వ కేంద్రం వద్ద ఓటింగ్ సరళిని పరిశీలించేందుకు వెళ్లిన రాష్ట్ర వైసీపీ ప్రధాన కార్యదర్శి పితాని బాలకృష్ణకు అక్కడ ఉన్న కూటమి కార్యకర్తలకు మధ్య పరస్పర వాగ్వివాదం చోటు చేసుకుంది. మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో అన్నంపల్లి, కొమానపల్లి గ్రామాల్లో వర్షం వచ్చినా ఓటర్లు మాత్రం ఓటు హక్కు వినియోగించుకోవడంలో ఎక్కడా వెనక్కు తగ్గలేదు. ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ తన కుటుంబ సభ్యులతో కలిసి ముమ్మిడివరం నగర పంచాయతీ చిప్పలపాలెం 28వ పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే కూటమి అభ్యర్థి దాట్ల సుబ్బరాజు తన కుటుంబ సభ్యులతో కలిసి మురమళ్ల 141వ పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ముఖ్యంగా యువత అధిక సంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఇతర రాష్ట్రాలు, విదేశాల నుంచి సుమారు 8వేల మంది ఓటర్లు నియోజకవర్గానికి వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఐ.పోలవరం మండలం తిల్లకుప్పలో వైసీపీ-టీడీపీ కార్యకర్తల మధ్య స్వల్ప వివాదం చేటుచేసుకుని తోపులాటలకు దారితీసింది. పోలీసులు రంగ ప్రవేశం చేసి వారిని చెదరగొట్టారు. అడిషనల్ ఎస్పీ కరణం కుమార్ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు నిర్వహించారు.

పోటెత్తిన ఓటర్లు

రామచంద్రపురం(ద్రాక్షారామ), మే 13: రామచంద్రపురం నియోజకవర్గంలో సోమవారం ఓటేసేందుకు ఓటర్లు పోటెత్తారు. రికార్డు స్థాయిలో పోలింగ్ శాతం నమోదైంది. రామచంద్రపురం నియోజకవర్గంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాతో పాటు ఉమ్మడితూర్పుగోదావరి జిల్లాలోనే అత్యధికంగా ఓటింగు నమోదై ప్రథమస్థానంలో నిలిచింది. చెదురుమదురు సంఘటనలు మినహాపోలింగ్ ప్రశాంతంగా జరిగింది. 2,03,207మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 1,00,682 మంది పురుషులు, 1,02,524మంది మహిళలు ఉన్నారు. ఉదయం రామచంద్రపురం పట్టణం, మండలం, కె.గంగవరం, కాజులూరు మండలాల్లో ఉదయం 7గంటలకు పోలింగ్ ప్రారంభించారు. ఉదయం 9గంటలకు 12.59 శాతం, 11గంటలకు 30.19 శాతం, 1 గంటకు 49.60 శాతం, 3 గంటలకు 65.33 శాతం, 5గంటలకు 78.27 శాతం, రాత్రి తొమ్మిది గంటలకు 85.48శాతం పోలింగు నమోదు అయింది.

ఈవీఎంలు మొరాయింపు: బూత్‌నెం30,41, 222, 180లలో ఈవీఎంలు మొరాయించడంతో పత్యామ్నాయ ఈవీఎంలు ఏర్పాటుచేసి పోలింగ్ నిర్వహించారు. కూటమి అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ పట్టణంలో రత్నంపేట పాఠశాలలో కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి ఓటుహక్కు వినియోగించుకున్నారు. వైసీపీ అభ్యర్థి పిల్లి సూర్యప్రకాష్, ఎంపీ బోస్ హసన్‌బాద జడ్పీ ఉన్నతపాఠశాలలో ఓటుహక్కు వినియోగించుకున్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ ఓటు హక్కు రామచంద్రపురంలో ఓటేశారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ దూడల శంకరనారాయణ దుగ్గుదుర్రులో ఓటు వినియోగించుకున్నారు. కాజులూరు మండలం ఆర్యావటం, కె.గంగవరం మండలం మసకపల్లి గ్రామాల్లో టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. రామచంద్రపురం డీఎస్పీ బి.రామకృష్ణ ఆధ్వర్యంలో సీఐ దొరరాజు, పలువురు ఎస్ఐలు, కేంద్ర బలగాలు బందోబస్తు నిర్వహించారు.

ఓటుహక్కు వినియోగించుకున్న అభ్యర్థులు

పి.గన్నవరం/అంబాజీపేట, మే 13: పి.గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గంలోని 212 కేంద్రాల్లో పోలింగ్ సోమవారం ప్రశాంతంగా జరిగింది. దేశ, విదేశాల నుంచి వచ్చిన వారు ఓటు హక్కు వినియోగించుకున్నారు. అంబాజీపేటలో మండలంలో పలు పోలింగ్ కేంద్రాల వద్ద టెంట్లు పూర్తిగా లేకపోవడంతో ఎండలో ఓటర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముక్కామలలో ముగ్గురు యువతులు ఓటు వేసిన అనంతరం సెల్ఫీలు దిగారు. మండలంలోని పలు ప్రాంతాల్లో చిన్న పాటి ఘర్షణలు జరగడంతో సీఐ డి.ప్రశాంత్‌కుమార్, ఎస్ఐ డి.చిరంజీవిలు సంఘటన స్థలాలకు చేరుకుని అక్కడ ఉన్న వారిని చెదరగొట్టారు. పి.గన్నవరం మండలంలో కూటమి అసెంబ్లీ అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ, వైసీపీ అసెంబ్లీ అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు ఓటు హక్కును వినియోగించుకున్నారు. అంబాజీపేటలోని ఓ పోలింగ్ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ అభ్యర్థి జంగా గౌతమ్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పి.గన్నవరం, అంబాజీపేటలోని పలు పోలింగ్ కేంద్రాలను నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఏ.శ్రీరామచంద్రమూర్తి పరిశీలించారు. నియోజకవర్గంలోని పలు కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ ఆలస్యంగా మొదలైంది. అక్కడ ఉన్న సిబ్బంది అర గంటలోపే ఈవీఎంలను మార్పుచేశారు. మండలంలోని వక్కలంక, గంగలకుర్రు, వ్యాఘ్రేశ్వరం, చినలంక పోలింగ్ కేంద్రాల్లో 6గంటలు దాటినా ఓటర్లు బారులు తీరడంతో ఆయా ప్రిసైడింగ్ అధికారులు ఓటర్లకు స్లిపులు అందించి ఓటు వేసేలా చర్యలు తీసుకున్నారు. ఆయా ప్రాంతాల్లో రాత్రి 9గంటల వరకు పోలింగ్ జరిగింది. అంబాజీపేటలో నాగాబత్తులవారిపాలెంలో పోలింగ్ కేంద్రం వద్ద మధ్యాహ్నం యువకులు ప్రచారం చేస్తున్నారని స్థానిక వైసీపీనేత పోలీసులకు చెప్పడంతో పోలీసులు అక్కడకు చేరుకున్నారు. ఆసమయంలో ఎస్ఐ కె.చిరంజీవికి స్థానిక వైసీపీ నేత నేలపూడి స్టాలిన్‌బాబుకు వాగ్వివాదం జరిగింది.

ఎండను సైతం లెక్క చేయకుండా

అయినవిల్లి, మే 13: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ మండలంలో ప్రశాంతంగా జరిగింది. ఉదయం నుంచి ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఓటర్లు బారులు తీరారు. ఎండను సైతం లెక్క చేయకుండా క్యూలైన్లలో వేచి ఉన్నారు. కొన్ని చోట్ల ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ ప్రారంభానికి ఆలస్యమైంది. సాయంత్రం 6 గంటలైనా ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓటర్లు క్యూలైన్లలో వేచి ఉన్నారు. క్యూలైన్లలో ఉన్న వారికి అధికారులు స్లిప్పులు పంపిణీ చేశారు. అధికంగా యువతతో పాటు ఇతర రాష్ట్రాల్లో ఉపాధి పొందున్న వారు సైతం ఓటు వేసేందుకు తరలివచ్చారు. దీంతో గ్రామాల్లో సంక్రాంతి పండుగ వాతావరణాన్ని మించి సార్వత్రిక ఎన్నికల వాతావరణం నెలకొంది.

446ఈవీఎంల వినియోగం

మండపేట, మే 13: మండపేట నియోజకవర్గంలో చదురుమదురు సంఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. నియోజకవర్గ పరిధిలో 87,186, 46,101,పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించడంతో ఈవీఎంలను మార్చారు. పోలింగ్ కేంద్రాలు వద్ద స్థానిక పోలీసులు, అదనపు బలగాలు బందోబస్తు నిర్వహించారు. నియోజకవర్గంలో ఎన్నికల సిబ్బంది పీవోలు, ఏపీవోలు 1,446మందితో పాటు వెబ్‌కాస్ట్ సిబ్బంది 136మంది, 223పోలింగ్ బూత్‌ల్లో 446 ఈవీఎంలు వినియోగించారు. నియోజకవర్గంలో 24 రూట్లుగా విభజించారు. నియోజకవర్గంలో అడిషనల్ ఎస్పీ, ఒక డీఎస్పీ, 10మంది సీఐలు, 17మంది ఎస్ఐలు, అదనపు బలగాలు, పోలీసులు కలిపి 389మంది బందోబస్తు నిర్వహిం చారు. పోలింగ్ కేంద్రాలు వద్ద జరుగుతున్న తీరును మండ పేట నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎల్లారావు తహసీల్దార్ కార్యాలయంలో వెబ్‌కాస్టింగ్ ద్వారా పర్యవేక్షించారు. ఇక్కడ నుంచే ఆయన పోలింగ్ సిబ్బందికి సూచనలు చేశారు. కూటమి అభ్యర్థి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పాటి మిద వున్న గౌతమిమున్సిపల్ హైస్కూల్ పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. వైసీపీ అభ్యర్థి తోట త్రిమూర్తులు, కుటుంబసమేతంగా వెళ్లి ఓటుహక్కును సత్యశ్రీ రోడ్డు లోని శ్రీవేగుళ్ల వీర్రాజు మున్సిపల్ పాఠశాల పోలింగ్ కేంద్రం వినియోగించుకున్నారు. జనసేననియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ కుటుంబ సమేతంగా వెళ్లి ఓటు హక్కును కపిలేశ్వరపురం మండలం వల్లూరులో వినియో గించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కామన ప్రభాకరరావు ఏడిదలో ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఉదయం ఏడు గంటలనుంచి పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు చేరుకుని బారులు తీరారు. నియోజకవర్గంలో పోలింగ్‌కేంద్రాలు వద్ద యువత మహిళలు, వృద్ధులు, సైతం మండుటెండను సైతం లెక్క చేయకుండా బారులు తీరి ఓటు హక్కు వినియోగించు కున్నారు. తెలంగాణ, కర్ణాటక, రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఓటు హక్కు వినియోగిం చుకున్నారు. పోలింగ్ కేంద్రాలు వద్ద ఓటర్లను ప్రధాన పార్టీల అభ్యర్థులు కలుసుకున్నారు.

52 కేంద్రాల్లో పోలింగ్

ఉప్పలగుప్తం, మే13: మండలంలోని 52కేంద్రాల్లో పోలింగ్ స్వల్ప ఘర్షణలు మినహ ప్రశాంతంగా ముగిసింది. గొల్లవిల్లిలోని మూడు పోలింగ్ కేంద్రాల్లో ప్రారంభంలోనే ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. ఎస్.కొత్తపల్లిలో ఈవీఎం మొరాయించడంతో గంటన్నర పాటు పోలింగ్ నిలిచిపోయింది. ఎస్.యానాంలోని పోలింగ్ కేంద్రంలో ప్రారంభంలోనే ఈవీఎంను మార్చవలసి వచ్చింది. అన్ని కేంద్రాల్లోనూ సిబ్బంది అవగాహనా లోపంతో పోలింగ్ మందకొడిగా సాగింది. కేంద్రాల వద్ద ఓటర్లు బారులుతీరి గంటల తరబడి క్యూలో నిలుచుని అసహనానికి గురయ్యారు. వృద్ధులను, దివ్యాంగులను యువకులు దగ్గరుండి కేంద్రాలకు తీసుకొచ్చి ఓటు వేయించారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కుటుంబాలు ఉదయాన్నే ఓటు వేశారు.అమలాపురం అసెంబ్లీ కూటమి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు స్వగ్రామం ఎస్.యానాంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. మాజీ ఎంపీ ఏజేవీబీ మహేశ్వరరావు గోపవరంలో ఓటు వేశారు.

వాడపాలెంలో బండారు ఓటు వినియోగం

కొత్తపేట, మే 13: కొత్తపేట నియోజకవర్గంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులుతీరారు. కొన్నిచోట్ల ఈవీఎంలు మొరాయించిన స్వల్ప సంఘటనలు చోటుచేసుకున్నా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించి సమస్యలను పరిష్కరించారు. కొత్తపేట అసెంబ్లీ కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు, ఆయన సోదరుడు, జనసేన ఇన్‌చార్జి బండారు శ్రీనివాసరావు స్వగ్రామం వాడపాలెంలో ఓటు హక్కువినియోగించుకున్నారు. కొత్తపేట నియోజకవర్గంలో 2,52,383మంది ఓటర్లు ఉండగా సాయంత్రం ఐదు గంటల సమయానికి 1,72,249మంది ఓటు హక్కును వినియోగించుకోగా 68.25శాతం నమోదైంది.









రాజోలు: చింతలపల్లిలో ఓటేసిన డిప్యూటీ మాజీ స్పీకర్ అల్లూరి వెంకటసూర్యనారాయణరాజు, ఆత్రేయపురం: మెర్లపాలెం వైసీపీ ఇచ్చిన బయట పడవేసిన చీరలు, ఉప్పలగుప్తం:చల్లపల్లిలో కొత్తగా ఓటేసిన యువతులు, సరిపల్లిలో ఓటేసిన మణిపూర్‌లో ఎస్పీ పి.మార్టిన్‌రాజు కుటుంబ సభ్యులు, పి.గన్నవరం: ఓటేసిన పి.గన్నవరం వైసీపీ అభ్యర్థి విప్పర్తి వేణుగోపాల్, ద్రాక్షారామ: హసన్‌బాదలో ఓటేసిన పిల్లి సూర్యప్రకాష్, ఎంపీ బోస్, ముమ్మిడివరం: ఓటేసిన వైసీపీ అభ్యర్థి పొన్నాడ సతీష్‌కుమార్

మానవత్వం చాటుకున్న కూటమి అభ్యర్థి బండారు

రోడ్డుప్రమాద బాధితులను ఆసుపత్రికి తరలించిన వైనం

కొత్తపేట, ఏప్రిల్ 13: సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌ను పరిశీలించేందుకు కొత్తపేట అసెంబ్లీ కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు పర్యటించారు. బిళ్లకుర్రు శివారు డేగలవారిపాలెం వంతెన సమీపంలోఅమలాపురం రోడ్డులో తల్లీకొడుకులు రోడ్డుప్రమాదానికి గురై రోడ్డుపై పడిఉండడాన్నిఅటుగా వెళ్తున్న బండారు సత్యానందరావు గమనించారు. తన వాహనాన్ని ఆపి బాధితులకు ధైర్యం చెప్పి 108అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. అంబులెన్స్ వచ్చిన తర్వాత బాధితులను స్థానికులసాయంతో అమలాపురం ఆసుపత్రికి పంపించారు. బాధితులను పి.గన్నవరం మం డలం యర్రంశెట్టిపాలేనికి చెందిన వారిగా గుర్తించారు. ఎన్నికల టెన్షన్‌లో ఉన్న సత్యానందరావు బాధితులను ఆసుపత్రికి పంపడాన్ని పలువురు అభినందించారు.


రోడ్డుప్రమాద బాధితులను ఓదారుస్తున్న కూటమి అభ్యర్థి బండారు

శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం

అమలాపురం రూరల్, మే 13: అమలాపురం కిమ్స్ వైద్య కళాశాల ప్రాంగణంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ నవమ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. రెండోరోజు సోమవారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని జరిపించారు. కల్యాణ కర్తలుగా కిమ్స్ చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు-బదరీలక్ష్మి, రవికిరణ్‌వర్మ-శేషపవిత్ర, శశికిరణ్‌వర్మ-వెంకటలక్ష్మి దంపతులతోవేదపండితులు శాస్త్రోక్తంగా స్వామివారి కల్యాణం జరిపించారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని అమ్మవార్లకు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.

గుళికలు కలిపిన ఆహారం తిన్న.. గోవుతో పాటు కుక్క మృతి

అమలాపురం టౌన్, మే 13: అమలాపురం కల్వకొలను వీధిలో గుళికలు కలిపిన ఆహారాన్ని గుర్తుతెలియని వ్యక్తులు పెట్టగా గోవుతో పాటు కుక్క అక్కడికక్కడే మృతిచెందగా మరో గోవు ప్రాణాపాయస్థితిలో ఉంది. సోమవారం జరిగిన ఈసంఘటన స్థానికులను కలచివేసింది. నడిరోడ్డుపై గోవులు విషాహారం తిని గంటసేపుకు పైగా కొట్టుకున్నాయి. కొన ఊపిరితో ఉన్న గోవుకు ఆర్ఎస్ఎస్ గోసంరక్షణ ప్రతినిధులు గొవ్వాల అచ్యుతరామయ్య, చాగంటి ప్రసాద్, స్వామి తదితరులు సేవలు అందించి హుటాహుటిన వైద్యులను రప్పించారు. పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ చీకట్ల వెంకటనారాయణ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది తక్షణ వైద్యం అందించి గోవును రక్షించారు.

అఖండ విజయం సాధిస్తా: దాట్ల

ఐ.పోలవరం, మే 13: ప్రజల ఆదరణతో అఖండ విజయం సాధిస్తానని ముమ్మిడివరం అసెంబ్లీ కూటమి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు అన్నారు. స్వగ్రామం మురమళ్లలో సోమవారం ఓటు వేసిన అనంతరం పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఓటు వేసిన వారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు తనకు మద్దతుగా నిలిచారన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తుల సాయి పాల్గొన్నారు. వీరేశ్వరస్వామిని సతీసమేతంగా బుచ్చిబాబు దర్శించుకున్నారు. స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం క్షేత్రపాలకుడు లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు.

శ్యామలాదేవి పూజలు



ఆత్రేయపురం, మే 13: కోనసీమ తిరుమల వాడపల్లి పుణ్యక్షేత్రం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం దివంగత రెబల్‌స్టార్ కృష్ణంరాజు సతీమణి ఉప్పలపాటి శ్యామలాదేవి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. తొలుత క్షత్రియ సామాజివర్గానికి చెందిన ప్రతినిధులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. వేదపండితుల ఆశీర్వచనం అందుకున్నారు. ఆమె వెంట సయ్యపురాజు చిట్టిరాజు తదితరులు ఉన్నారు.

తాగునీటి పంపిణీలో చేపలు



మామిడికుదురు, మే 13: ఆర్‌డబ్ల్యుఎస్ పథకం ద్వారా గ్రామాల్లో పంపిణీ చేసిన తాగునీటిలో సోమవారం చేపలు వచ్చాయి. మామిడికుదురులో ఓ ఇంటి వద్ద తాగునీరు పట్టుకుంటున్న సమయంలో బకెట్‌లోకి చేపలు రావడంతో ఆ కుటుంబ సభ్యులు అవాక్కయ్యారు. అప్పుడప్పుడు పైపులైను ద్వారా వివిధ రకాల వ్యర్థాలు, చెత్తా చెదారం వస్తుందని, శుద్ధి చేసిన తాగునీటిని అందించాలని ప్రజలు కోరుతున్నారు.